
సాక్షి పల్నాడు

బుధవారం, 22, మే, 2024



నేడు నృసింహస్వామి కల్యాణం

తాడేపల్లిరూరల్: పోలకంపాడులోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. బండ్లమ్మ వారిని మహా గౌరీ దేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

24న డీఈఈ సెట్ ఆన్‌లైన్ పరీక్ష

నెహ్రూనగర్: డీఈఈ సెట్ 2024 కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్ ఈనెల 24వ తేదీ నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పరిధిలో రెండు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, శ్రీ మేధా టవర్స్, చల్లావారిపాలెం, నల్లపాడు, గుంటూరు సెంటర్ కోడ్ 8384, బాలాజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బి బ్లాక్, చల్లావారిపాలెం, నల్లపాడు, గుంటూరు, సెంటర్ కోడ్ 30318 సెంటర్స్‌లో ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 384 మంది హాజరు కానున్నారని చెప్పారు. కేటాయించిన సెంటర్‌కు అభ్యర్థులు ఒక గంట ముందుగానే హాజరు కావాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద డిపార్ట్‌మెంట్ అధికారులను కేటాయించామని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్‌లో ఏమైనా పొరపాట్లు ఉంటే డిపార్ట్‌మెంట్ అధికారుల ద్వారా సరిచేసుకోవచ్చన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, గుంటూరులో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల విభాగం ద్వారా తమ సమస్యలను ముందుగానే పరిష్కరించుకోవాలన్నారు.

రేపు భావన్నారాయణుని రథోత్సవం



బాపట్ల: శ్రీ మత్స్యాందరవల్లి రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, రథోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు కె.సుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానిక దేవాలయంలో వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం శ్రీవారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బాబు నాగేంద్ర, వి.శ్రీనివాసరావు, వెంకటరమణబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు అనుమతుల్లేవ్

- కలెక్టర్ శ్రీకేశ్ జీ లత్కర్
- జిల్లాలో పలు ఇసుక రీచ్‌ల పరిశీలన



మల్లాది ఇసుక రీచ్ వద్ద వివరాలు ఆరా తీస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బీ లత్కర్

అచ్చంపేట: సుప్రీంకోర్టు ఆదేశాలు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల మేరకు అన్ని అనుమతులు వచ్చిన తరువాతే ఇసుక రీచ్‌లలో తవ్వకాలు ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బీ లత్కర్ తెలిపారు. మండలంలోని కోనూరు ఇసుక రీచ్‌ని మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతానికి జిల్లాలో ఎక్కడా ఇసుక త్వవకాలకు అనుమతులు లేవని తెలిపారు. నిబంధనల మేరకు గుర్తించిన ఏజెన్సీ, ప్రభుత్వానికి తగిన రుసుం చెల్లించిన తరువాతే ఇసుక రవాణాను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. రీచ్‌ల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేయడం నేరమన్నారు. ప్రతి రీచ్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు అమర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇసుక రీచ్ వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ కోరారు. ఆయన వెంట సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ, భూగర్భ గనుల శాఖ అధికారిణి నాగిని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సుధా, అచ్చంపేట తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అమరావతి మండలంలో..

అమరావతి: మండల పరిధిలోని మల్లాది, దిడుగు ఇసుక రీచ్‌లను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలో ఐదు డిసిల్టింగ్ పాయింట్‌లలో ఇసుక తీయటానికి ఏజెన్సీని ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. వారి కంపెనీ పేరుమీద అనుమతులు బదిలీ కాని కారణంగా ఇసుక తవ్వకాలు జరపడానికి వీల్లేదని చెప్పారు. అనుమతులు పొందిన తర్వాత నిబంధనల మేరకు తగిన రుసుం చెల్లించి మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు సాగించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇసుక రీచ్‌ల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి మురళీకృష్ణ, భూగర్భ గనుల శాఖ అధికారి నాగిని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ సుధా ఉన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ జీ లత్కర్
- కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలన



కౌంటింగ్ కేంద్రం వద్ద జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్, ఎస్పీ మలికా గార్గ్, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బీ లత్కర్ తెలిపారు. కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌ను మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఉన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు ప్రక్రియలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించకూడదని హెచ్చరించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా సిబ్బందిని కేటాయించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం ప్రహరీ చుట్టూ వంద మీటర్ల వరకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వంద మీటర్ల లోపలికి ఏ వాహనాన్ని అనుమతించకూడదని కోరారు. ప్రధాన ద్వారం వద్ద పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని కోరారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ముందుగానే కౌంటింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సూచించారు. కౌంటింగ్ రోజు నిర్వహించాల్సిన విధివిధానాలపై అభ్యర్థులకు, ఏజెంట్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ర్యాలీలు, ఊరేగింపులు నిషేధం..

ఎన్నికల అనంతరం జరుగుతున్న పరిణామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ తెలిపారు. జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అనుమానితులను బైండోవర్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జూన్ 6వ తేదీ వరకు ఎటువంటి ర్యాలీ, ఊరేగింపు, బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, రిటర్నింగ్ అధికారి రమణకాంత్‌రెడ్డి, సరోజ, ఈవీఎం నోడల్ అధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సీబీఎస్ఈ

- తొలి విడతగా జిల్లాలో 67 పాఠశాలలు ఎంపిక
- 9 నుంచి ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- 17 నుంచి 21వ తేదీ వరకు ఉపాధ్యాయులకు శిక్షణ



నరసరావుపేటలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. విజ్ఞాన కాంతులు వెదజల్లుతున్నాయి. ప్రతిఒక్కరికీ నాణ్యమైన విద్యనందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. అందుకు అనుగుణంగా సర్కారు బడుల్లో సంస్కరణలు చేపట్టారు. నాడు– నేడు కింద పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. డిజిటల్ విద్య అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం బైలింగ్విన్ విధానంలో పాఠ్యపుస్తకాలు ముద్రించింది.

సీబీఎస్ఈతో ముందడుగు..

కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు బోధించే సీబీఎస్ఈ సిలబస్‌ను సర్కారు బడుల్లో అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా దశల వారీగా పాఠశాలలను ఎంపిక చేసింది. తొలుత ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు అమలు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అమలు చేయనున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తోంది. జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయనున్నారు.

పాఠశాలల ఎంపిక ఇలా...

సీబీఎస్ఈ కింద జిల్లాలోని 67 పాఠశాలలను తొలుత ఎంపిక చేశారు. వీటిల్లో 13 మోడల్ స్కూల్స్, 24 కేజీబీవీలు, 11 ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు, 19 జెడ్పీహెచ్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో బట్టీ విధానానికి, మూస పద్ధతికి స్వస్తి పలికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్‌ను అమలు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియపై జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో సీబీఎస్ఈకి ఎంపిక కాబడిన 67 పాఠశాలల్లో పని చేస్తున్న పీజీటీ, జేఎల్స్ ఉపాధ్యాయులందరికీ నరసరావుపేటలోని శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 17, 18న ఇంగ్లిష్, సోషల్, బయాలజీ సబ్జెక్టులకు కేటాయించిన 386 మందికి, 20, 21న మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు కేటాయించిన 341 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం..

ఇప్పటి వరకు కార్పొరేట్, ఇతర ప్రత్యేక పాఠశాలల్లోనే సీబీఎస్ఈ విధానం అమలవుతోంది. ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే సీబీఎస్ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల విద్యార్థులకూ ఇటువంటి బోధన అందించాలన్న సంకల్పంతో చర్యలు తీసుకుంది. అన్ని రకాల వనరులూ ఉండి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో దీన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే అవకాశం ఉంది. ఆయా విద్యాలయాల పర్యవేక్షణ కేంద్రం ప్రభుత్వ పరిధిలోకి వెళ్తుంది. విద్యార్థుల ఆసక్తి, అభిరుచిని గుర్తించి వివిధ రంగాల్లో వారిని ప్రోత్సహిస్తారు.


> **పోటీ ప్రపంచంలో రాణించేందుకు దోహదం**
>
> 
>
> పోటీ ప్రపంచంలో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచుకొని జాతీయ పరీక్షలకు హాజరు కావడానికి సీబీఎస్ఈ సిలబస్ దోహదపడుతుంది. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా గా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరం.
>
> –ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, పల్నాడు

క్లుప్తంగా

ఎమ్మెల్యే ఇంటిపై దాడి కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట టౌన్: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడి కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ భాస్కర్ మంగళవారం తెలిపారు. ఎన్నికల పోలింగ్ రోజు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో టీడీపీ రౌడీమూక సుమారు 200 మంది మారణాయుధాలతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటిపై దాడికి పాల్పడి, అక్కడ ఉన్న కార్లు, ఇంటి అద్దాలు ధ్వంసం చేసిన విషయం విదితమే. అడ్డుపడిన ఎమ్మెల్యే మామ కంజుల రామకోటిరెడ్డిపై టీడీపీ గూండాలు మారణాయుధాలతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. నిందితుల్లో లాం కోటేశ్వరరావు, శాఖమూరి మారుతి, బండా నాగూర్, మహబూబ్ బాషా, ఖాజా, ఇంటూరి మహేష్, తిరుపతి తదితరులు తొమ్మిది మంది అరెస్ట్ చేశారు. మరి కొంత మంది నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాదినపాడులో కార్డన్ సెర్చ్



దాచేపల్లి: మండలంలోని మాదినపాడు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఎ.సురేంద్రబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం అనుమానాస్పద నివాస గృహాల్లో తనిఖీలు చేపట్టారు. కొంతమంది ఇళ్ల నుంచి కర్రలు, రాళ్లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి గ్రామంలో భయనక పరిస్థితులు కల్పిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జీ.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

తొండపిలో...

తొండపి(ముప్పాళ్ల): గ్రామంలో సత్తెనపల్లి సీఐ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కార్డన్‌సెర్చ్ మంగళవారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దాడుల అనంతరం చోటుచేసుకున్న పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలలో భాగంగా తనిఖీలు చేపట్టారు. విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. . గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని సీఐ చెప్పారు. ఎస్‌ఐ పి.హజరతయ్య పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుకు సమాయత్తం

- 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా
- సేద్యం చేసి భూసారాన్ని పెంచుకోవాలంటున్న అధికారులు
- ఖర్చు, వాతావరణ కాలుష్యం తగ్గుదల



పిల్లిపెసర పంట చేనులో రైతులు (ఫైల్)

నరసరావుపేట: జిల్లాలో ఖరీఫ్‌కు ముందస్తు తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. దీనికి గాను భూమి సారవంతాన్ని చేసుకునేందుకు కావాల్సిన పచ్చిరొట్ట ఎరువులను సాగుచేయటం అనేది రైతుల కర్తవ్యం. రైతులు సేంద్రీయ ఎరువుల వాడకాన్ని తగ్గించటం వలన నేల దెబ్బతిని సూక్ష్మ పోషక లోపాలు రావటం వలన ఒక స్థాయికి మించి దిగుబడులు పెరగటంలేదు. పశు సంపద చాలా వరకు తగ్గిపోవటం వలన నేలకు సేంద్రీయ పదార్థాన్ని అందించి నేల సారాన్ని పెంచటానికి పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగు, పిల్లి పెసర వాడకం తప్పనిసరైంది. బోర్లు ఉన్న రైతులు వేసవిలో పడే వర్షాలపై ఆధారపడి పచ్చిరొట్ట వేయవచ్చు. కాలువ నీటిపై ఆధారపడిన రైతులు వీటి విడుదలను బట్టి రెండు నెలల ముందు పచ్చిరొట్ట, పచ్చి ఆకు ఏరువులను వాడి నేలసారాన్ని పెంచి రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గించి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించటంలో తోడ్పాటు అందించాలని రైతాంగానికి ప్రభుత్వం సూచిస్తుంది. పట్టిరొట్ట ఎరువుల యాజమాన్యంపై జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువుల వాడకం వలన ఉపయోగాలు

నేల భౌతిక స్థితి మెరుగుపడి నీటిని, పోషకాలు నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుంది. పచ్చిరొట్ట ఎరువును సరైన సమయంలో వేసి నేలలో కలియదున్నటం వలన అవి కుళ్లేటప్పుడు విడుదలయ్యే ఆమ్లాల వలన నేలలో మొక్కలకు అందని రూపంలో ఉన్న భాస్వరం, పొటాష్, మొక్కలకు అందటమే గాకుండా గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరించబడుతుంది. దీంతో పాటు నేలసారం పెరిగి సమస్యాత్మక నేలలు కొంతవరకు బాగుపడతాయి. పంట ఆరోగ్యం పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. నేలలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి పంట వేర్ల ఆరోగ్యం, పటుత్వం పెరుగుతుంది.

పచ్చిరొట్ట పైర్ల రకాలు..

పచ్చిరొట్ట ఎరువుల్లో పచ్చి రొట్ట పంటలు, పచ్చి ఆకునిచ్చే పంటలని రెండు రకాలు ఉన్నాయి. అందులో పచ్చిరొట్ట పంటలు జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటివి పూతవచ్చే వరకు పెంచి నేలలో కలియదున్నుతారు. రెండోది పచ్చి ఆకునిచ్చే రకాల్లో అవిసె, కానుగ, జిల్లేడు, వెంపలి, సీమ, తంగేడు చెట్లు, మొక్కలను కోసి పొలంలో త్రొక్కుతారు.

పచ్చిరొట్ట ఎరువుల వాడకంలో సూచనలు

పచ్చిరొట్ట ఎరువులను పూతదశలో కలియదున్నాల్సిఉంటుంది. నేలలో కలియదున్నేటప్పుడు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేస్తే అవి త్వరగా నేలలో కుళ్లిపోతాయి. ప్రధాన పంటకు 50 కిలోల ఎరువును తగ్గించి వాడవచ్చు. రొట్ట మురిగేందుకు వేరే పంటలు వేయకుండా మురిగేంతవరకు ఆగి నీటిని తీసివేసి కొత్త నీరు పెట్టాల్సి ఉంది. పచ్చిరొట్ట సాగుచేసిన నేలలో నత్రజని తక్కువగా ఉంటే ఎకరాకు ఎనిమిది కిలోల నత్రజని వేయటం వలన ఏపుగా పెరిగి రొట్ట ఎక్కువ వస్తుంది.

పచ్చిరొట్ట ఎరువుల్లో లభించే పోషకాలు..

పోషకాలు పరిశీలిస్తే.. జనుము ఎకరాకు పది కిలోలు వినియోగిస్తే ఎనిమిది నుంచి పది టన్నుల పచ్చిరొట్ట వస్తుంది. దీనిలో టన్నుకు నత్రజని ఆరు నుంచి తొమ్మిది కేజీలు, భాస్వరం ఒకటి నుంచి రెండు, పొటాష్ ఏడు నుంచి పది కిలోల వరకు లభిస్తుంది. జీలుగలో ఎకరాకు పది కిలోలు వినియోగిస్తే ఐదు నుంచి ఏడు టన్నుల వరకు పచ్చిరొట్ట లభిస్తుంది. దీనిలో నత్రజని ఐదు నుంచి ఏడు, భాస్వరం ఒకటి నుంచి ఒకటిన్నర, పొటాష్ ఏడు నుంచి ఎనిమిది కేజీలవరకు లభ్యమౌతుంది. పిల్లి పెసరలో ఎకరాకు ఎనిమిది కేజీలు వినియోగిస్తే రెండున్నర నుంచి మూడు టన్నులవరకు పచ్చిరొట్ట లభిస్తుంది. దీనిలో నత్రజని తొమ్మిది నుంచి 11, భాస్వరం ఒకటిన్నర నుంచి రెండు, పొటాష్ ఎనిమిది నుంచి 10కేజీల వరకు లభిస్తుంది.

పంట	సాధారణ విస్తీర్ణం	ప్రతిపాదిత సాగు విస్తీర్ణం
వరి	42,095	42,500
కంది	19,259	21,250
మినుము	1159	1300
పెసర	213	500
మిరప	58202	75220
పత్తి	1,07,186	1,22,500
ఇతర పంటలు	20,196	16,450
మొత్తం	2,48,350	2,79,720

పైరు	కేటాయించిన పరిమాణం (క్వింటాళ్లో)	సబ్సిడీ రూ.	మొత్తం ధర రూ.	రైతు చెల్లించాల్సిన దర రూ.
జీలుగ	3027	8800	4400	4400
జనుము	1645	8800	4400	4400
పిల్లిపెసర	1563	13,400	6700	6700

ప్రధాన పంటల సాగు విస్తీర్ణం

పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటలుగా ప్రత్తి, మిరప, వరి, కంది, మినుము, పెసర సాగుచేస్తున్నారు. పంటల సాధారణ, ఆశించే పంటల సాగు విస్తీర్ణం ఆవిధంగా ఉండనుంది. ఈ ఖరీఫ్‌కు జిల్లాలో ఏపీ సీడ్స్ ద్వారా 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను 421 ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేయబడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

- పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్
- ఎన్నికల ఘర్షణలో 950 మందిపై కేసులు



పట్టణంలో పోలీసు కవాతులో పాల్గొన్న ఎస్పీ మలికా గార్గ్

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న అల్లర్లకు సంబంధించి 950 మందిపై 149 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ తెలిపారు. మంగళవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని చెప్పారు. జిల్లాలో పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. అల్లర్లకు పాల్పడిన వారిపై పూర్తి ఆధారాలతోనే కేసు నమోదు చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే 250 మందిని గుర్తించామని, వారిపై బైండోవర్ కేసులు పెట్టి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి పూచీకత్తుపై విడుదల చేశామని చెప్పారు. వారిలో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక బందోబస్తు కల్పిస్తామని ముఖ్యంగా అభ్యర్థులకు రక్షణ కల్పించటంలో ప్రత్యేక చొరవ చూపిస్తున్నామని, కౌంటింగ్ అనంతరం గ్రామాలలో ప్రశాంతత నెలకొల్పేందుకు అన్నీ పార్టీల ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించి, శాంతియుత వాతావరణానికి దోహదపడాలని సూచించారు. ప్రపంచ దేశాల్లోనే ప్రజాస్వామ్యంగా భారతదేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతలున్నాయని, అలాంటి పేరును ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చేందుకు ప్రజలందరూ శాంతియుతబాటపట్టి ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించాలని ఆమె కోరారు. అనంతరం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, గురజాల డీఎస్పీ సిహెచ్.శ్రీనివాసరావు, జగదీష్, సీఐలు బ్రహ్మయ్య, సురేష్, ఎస్‌ఐలు అరుణ, రాజశేఖర్, పట్టాభిరామయ్య ఉన్నారు.

మాచర్లలో అల్లర్లపై ఎస్పీ విచారణ

మాచర్ల: పట్టణానికి ఎస్పీ మలికా గార్గ్ మాచర్ల జరిగిన హింసాత్మక ఘటన సంబంధించి విచారించేందుకు మంగళవారం వచ్చారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పోలీసులు మాచర్లను పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ షాపులూ మూతబడ్డాయి. మధ్యాహ్నం నుంచి పట్టణంలో నిర్మానుష్యం నెలకొంది.ఆమె పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో కేసుల గురించి అనుమానితులు, నిందితులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

- జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్
- పకడ్బందీ ఏర్పాట్లకు ఆదేశం



కలెక్టరేట్‌లో పరీక్షలపై అధికారులతో సమీక్ష చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ ఆరు వరకు నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పదో తరగతి పరీక్షలపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా సుమారుగా 6199 మంది ప్రైవేటు, రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా పరీక్ష కేంద్రాలకు వెళ్లే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఊరేగింపులు, బహిరంగసభలు వల్ల విద్యార్థులకు ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలు వద్ద 144 సెక్షన్ అమలు అయ్యేలా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సమస్యల పరిష్కారానికి 99631 92487 నంబరుకు కాల్‌చేసి పరిష్కారం పొందాలని ఆయన సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈమేరకు రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు 6,199 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. వీరిలో రెగ్యులర్ 3,730 మంది, ప్రైవేటు 2,469 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

జిల్లాలో ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు

- జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్
- కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం



కలెక్టరేట్‌లో కమిటీ సభ్యులతో సమావేశమైన జేసీ శ్యాంప్రసాద్, అడ్మిన్ ఎస్పీ రాఘువేంద్ర

నరసరావుపేట: జిల్లాలో నాలుగు రోజుల నుంచి ఎక్కడా ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరగట్లేదని జేసీ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘువేంద్రతో కలసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్, కలెక్టర్ క్రోసూరులోని ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారని, అక్కడ ఎటువంటి తవ్వకాలు జరగట్లేదని గుర్తించారన్నారు. ఇక మీదట కూడా అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. రీచ్‌లలో ట్రెంచ్‌లు తవ్వకం, చుట్టు పక్కల గ్రామాల్లో దండోరా వేయటం, ట్రోల్ ఫ్రీ నంబరు 1800–599–4599ల ద్వారా ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సభ్యులైన ఎస్ఈబీ, పోలీసు, రెవెన్యూ, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల విలువైన విత్తనాలు స్వాధీనం

ఇంకొల్లు (చినగంజాం): మండల కేంద్రం ఇంకొల్లులోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మండల వ్యవసాయాధికారి కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హనుమాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో రెండు కంపెనీలకు చెందిన విత్తనాలకు ఎటువంటి సర్టిఫికెట్లు లేనట్లు గుర్తించారు. రూ.3,36,388 విలువ కలిగిన 28 కిలోల విత్తనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, మండల వ్యవసాయాధికారి పి.వేణుగోపాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న గృహాల పరిశీలన

లేఅవుట్లను సందర్శించిన ఢిల్లీ సెక్రటేరియట్ బృందం



ప్రత్తిపాడు: ఇళ్లు ఎలా ఉన్నాయి, నిర్మాణానికి ఎంత ఖర్చయింది, ప్రభుత్వం ఎంత చెల్లించింది, మీకు అదనంగా ఎంత ఖర్చయ్యింది, కాలనీలో వసతులు ఎలా ఉన్నాయంటూ ఢిల్లీ సెక్రటేరియట్ అధికారుల బృందం హౌసింగ్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్తిపాడులోని జగనన్న హౌసింగ్ లే అవుట్‌ను మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీ సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లుగా చేస్తున్న ఆరుగురు అధికారుల బృందం పర్యటించింది. సెక్రటేరియట్ ఏఎస్‌ఓలు జలేష్‌యాదవ్, అమర్‌దీప్ చౌహాన్, ధృవ్ దమిజా, కపిల్, పూజా, శృతి కాలనీలోని ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ సౌకర్యం, మంచి నీటి కుళాయిలు ఉన్నాయా లేవా అన్న విషయాలను గృహాల్లోకి వెళ్లి పరిశీలించారు. కాలనీలో ఇబ్బందులు లేవని లబ్ధిదారులు బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఉచితంగా ఇంటి స్థలాన్ని అందించిందని, రిజిస్ట్రేషన్ చేసి మరీ తమకు డాక్యుమెంట్లు అందజేసిందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లును బృంద సభ్యులకు చూపించి ఆనందం వ్యక్తం చేశారు.

- అనంతరం నడింపాలెం గ్రామంలో బృందం పర్యటించింది. సంపద కేంద్రం (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్)లో గ్రామ పంచాయతీ చేస్తున్న వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించారు. వర్మీ కంపోస్టు నాణ్యత బాగుండటంతో అధికారుల బృందం 12 ప్యాకెట్లను కొనుగోలు చేశారు.
- తుమ్మలపాలెంలో పర్యటించిన బృందం గ్రామంలో అమలవుతున్న జల జీవన్ మిషన్ పథకాన్ని పరిశీలించింది. బృందం వెంట నోడల్ ఆఫీసర్ నాగానంద్, అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ జీవీఆర్ గుప్తా, డీపీఆర్‌సి డీటీఎం నాగేశ్వరరావు, ప్రత్తిపాడు మండల ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా తుమ్మలపాలెం శివాజీ తదితరులు ఉన్నారు.

దూరవిద్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని సార్వత్రిక, దూరవిద్యా కేంద్రం ద్వారా వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తికి సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ కె.గురవారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల రైతులు, మహిళలు, యువతకు 8 వారాల పాటు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే పలు కోర్సులను ఇప్పటికే ఏప్రిల్ నుంచి ప్రారంభించామని పేర్కొన్నారు. మిద్దె తోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల తయారీ వంటి మూడు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. ఆసక్తిగల వారు రూ 1500 ఫీజు చెల్లించి జూన్ 20లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, తప్పనిసరిగా కంప్యూటర్‌కానీ, ఆండ్రాయిడ్ ఫోన్ కానీ, ఐపాడ్ కానీ కలిగి ఉండాలని సూచించారు. మరిన్ని వివరాలకు డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్‌ను సందర్శించాలని వెల్లడించారు.